క్లుప్తంగా

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

నందిగామ టౌన్‌: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేం చేసి ఉన్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, పెన్నుల పంపిణీ



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా 117వ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నోట్‌ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను జగ్గయ్యపేట బ్రాంచ్‌ మేనేజర్‌ ఎండీ ఇంతియాజ్‌ షరీఫ్‌ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ విజయశేఖర్‌, గోవర్ధన్‌, నవీన్‌, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



మక్కపేట(వత్సవాయి): భీమవరం రోడ్డులోని మండల, జిల్లా పరిషత్‌ పాఠశాల వద్ద రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గం గుండా ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు విజయవాడకు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి అధ్వానంగా ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. గుంతల్లో నీరు నిలవడం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌లో గుంతలు కనపడక కింద పడి గాయాలు పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జుజ్జూరు(వీరులపాడు): దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్‌ రమావత్‌ కోటి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని ప్రధాన వీధుల్లో పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండటంతో దోమల వ్యాప్తి కూడా పెరిగిందన్నారు. దోమల ఉధృతితో రోగాలు ప్రబలే అవకాశముండటంతో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులు, ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల మందు ఫాగింగ్‌ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలని వినతి



కంచికచర్ల: స్థానిక పశువుల ఆస్పత్రి రోడ్డులో పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగించకపోవటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. నాలుగు రోజుల నుంచి చెత్తను తొలగించకపోవటంతో వర్షానికి చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. దీంతో పశువుల ఆస్పత్రికి గాని, హనుమాన్‌పేట, నవభారత్‌ రోడ్డుకు వెళ్లాలన్నా ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆర్టీసీ బస్టాండ్‌ తూర్పుభాగాన చెత్త చెదారం ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఆస్పత్రి రోడ్డులో ఉన్న చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక తేమతో పంటలకు అపార నష్టం

- పంట పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు
- ఆందోళనలో పత్తి, మిర్చి రైతులు
- నష్ట నివారణకు సూచనలు చేసిన యంత్రాంగం



షేర్‌మహ్మద్‌పేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

పెనుగంచిప్రోలు: ఖరీఫ్‌ సీజన్‌లో వర్షాలు అధికంగా కురుస్తుండటంతో మెట్ట పంటలకు అపార నష్టం కలగనుంది. ఎడతెరపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి, మిర్చి పంటలు నష్టపోయే ప్రమాదం ఉంది. వర్షపు నీటిలో పంటలు మునగడంతో నష్టం జరుగుతోంది. నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో ఈఏడాది ఇప్పటి వరకు 19 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మరో 1000 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. మిర్చి రైతులు ఇంకా సాగు చేపట్టలేదు. నర్సరీల్లో నారు ఉంది. ఆగస్టు నెలలో రైతులు సాగు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. వర్షాలు మాగాణికి నష్టం చేయక పోయినప్పటికీ పత్తి, మిర్చి పంటలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. వర్షాలకు పంటలు నీట మునిగి కుళ్లిపోతాయి. ఏ పంటైనా అధిక తేమ ఉంటే ముడుచుకుపోతుంది. పత్తి ఆకులు ఎర్రబడి చెట్టు మొత్తం ఎర్రగా మారి ఎండి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలను కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ ఏడీఏ కె.భవాని, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు ఎస్‌.కృష్ణంరాజు, బి.వెంకటేశ్వర్లు, తదితరులు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

పత్తిలో..

- సాధ్యమైనంత వరకు పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. భూమిలో తేమను తగ్గించుకోవటానికి తేమ ఆరగానే అంతర సేద్యం చేయాలి.
- వర్షం తగ్గిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ ఎరువులు చల్లుకోవాలి. సూక్ష్మ పోషక లోప నివారణకు ఫార్ములా-4 పొటాషియం నైట్రేట్‌ వంటి సూక్ష్మ పోషకాలు కలిగిన ఎరువులను పై పాటుగా పిచికారీ చేయాలి.



వరద నీటి ప్రవాహానికి వడలి పోతున్న పత్తి మొక్కలు

మిర్చి నారుమడుల్లో..

- అధిక వర్షాలకు మిరప నారు మళ్లలో తెగులు గుర్తిస్తే లీటర్‌ నీటికి రెండున్నర గ్రాముల బ్లెటాక్స్‌ కలిపి పిచికారీ చేయాలి.
- వరి నారుమడుల్లో వర్షం తగ్గిన వెంటనే ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్‌ చల్లుకోవాలి.

పంటల పరిశీలన..

జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని మక్కపేట, పెనుగంచిప్రోలు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాలలోని పత్తి, మిర్చి పంటలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అధిక వర్షాలకు పొలాలలో తేమ శాతాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్‌ కృష్ణంరాజు మాట్లాడుతూ.. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని పొలాలలో తేమ అధికంగా ఉండటం వల్ల మొక్క పెరుగుదలలో అవాంతరాలుంటాయన్నారు. వర్షాలు తగ్గిన తరువాత తేమ ఎక్కువగా ఉన్న పంట పొలాలలో ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ ఎరువులను అందించాలన్నారు. అదే విధంగా మిర్చి నారుమడులలో తెగుళ్లు గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ భవానీ, ఏఓలు వరలక్ష్మి, రామసుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ వ్యవస్థాపక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

జగ్గయ్యపేట అర్బన్‌: భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్‌ ప్లాంట్‌ జగ్గయ్యపేట లైమ్‌ స్టోన్‌ మైన్స్‌ వద్ద ఉద్యోగులు, కార్మికులు భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. మజ్దూర్‌ సంఘ్‌ నాయకులు మాట్లాడుతూ.. దేశభక్త కార్మికుల, సమాజ హితం, పరిశ్రమ హితం, కార్మిక హితమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కార్మికుల నాయకత్వంతో పనిచేసే కార్మిక అఖిల భారత భారతీయ సంస్థ భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ 70వ సంస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. సంఘ్‌ కార్యదర్శి రామచంద్రనాయక్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ హేమానాయక్‌, మన్నె శ్రీనివాసరావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం సాగు భూమి కేటాయించాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్మిక సంఘ నాయకులు

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని అల్ట్రాటెక్‌ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఐదెకరాల సాగు భూమిని కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్‌ డిమాండ్‌ చేశారు. గ్రామంలో మంగళవారం మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ఫ్యాక్టరీలో బాయిలర్‌ పేలుడు కారణంగా గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్‌, బాణావత్‌ స్వామి, పరిటాల అర్జున్లు మృతి చెందారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఐదెకరాల భూమిని కేటాయించాలని కోరారు. అదే విధంగా గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ బాగా లేదని కర్మాగారం నుంచి గ్రామాభివృద్ధికి నిధులు వస్తున్నా పంచాయతీ అధికారులు వినియోగించుకోలేకపోవటం బాధాకరమని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆనందరావు, మండల కార్యదర్శి కోట కృష్ణ, నాయకులు భాస్కరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత కోసం 'అలనాటి రామచంద్రుడు'

డైరెక్టర్‌ ఆకాష్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి డ్యాన్స్‌ చేస్తున్న హీరో, హీరోయిన్‌ కృష్ణవంశీ, మోక్ష

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): నేటి యువతరాన్ని ఆకట్టుకునేలా 'అలనాటి రామచంద్రుడు' సినిమా తీశానని చిత్ర దర్శకుడు చిలుకూరి ఆకాష్‌రెడ్డి తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం మంగళవారం కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్‌ కళాశాలలో సందడి చేసింది. డైరెక్టర్‌ ఆకాష్‌రెడ్డి, హీరో కృష్ణవంశీ, హీరోయిన్‌ మోక్షకు కళాశాల ప్రిన్సిపాల్‌ రామకృష్ణయ్య స్వాగతం పలికారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. హీరో, హీరోయిన్‌ విద్యార్థులతో కలిసి డ్యాన్స్‌ చేసి జోష్‌ నింపారు.
చిత్రానికి సంబంధించి కాంటెస్ట్‌ నిర్వహించారు. విజేతలకు టీషర్ట్‌లు, క్యాప్‌లు అందజేశారు. సినిమాను ఆగస్టు 2న థియేటర్లలో మాత్రమే చూడాలని, పైరసీకి తావివ్వద్దని సూచించారు. యూత్‌కు నచ్చే మంచి లవ్‌స్టోరీతో సినిమా ఉంటుందని డైరెక్టర్‌ వివరించారు.

28న మెగా వైద్యశిబిరం

జగ్గయ్యపేట అర్బన్‌: మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన స్థానిక జీవీజే జిల్లా పరిషత్‌ బాలుర హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌ కుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్యశిబిరంలో డయాబెటిక్‌, గుండె జబ్బులు, నరాలు, నాడీ, జనరల్‌, కీళ్ల ఎముకల వైద్యులు, చిన్న పిల్లల వైద్యులు, చర్మవ్యాధులు, మూత్రపిండాలు, క్యాన్సర్‌, దంత, కంటి, ఆయుర్వేద వైద్యులు, ఫిజియోథెరపీ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి డాక్టర్‌ సలహా మేరకు షుగర్‌ పరీక్షలు, బీపీ పరీక్షలు, టూడీ, ఏకో పరీక్షలు, ఈసీజీ, అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌ పరీక్షలు, క్యాన్సర్‌కు సంబంధించిన పీఏపీ స్మీయర్‌, సీఏ125, పీఎస్‌ఏ పరీక్షలు కూడ వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుపై కంటి ఆపరేషన్లు, గుండె సంబంధిత ఆపరేషన్లు అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జగ్గయ్యపేట, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

వీరులపాడు: ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. వీరులపాడు పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఆటో డ్రైవర్లకు మంగళవారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ నిబంధనలపై ఆటో డ్రైవర్లు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం వలన ప్రమాద సమయాలలో ప్రమాద తీవ్రత కూడా అధికంగా ఉంటుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే, వాహనాలను సీజ్‌ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు మెట్ట పైర్లు కళకళ

- వర్షాలతో ఊపిరి పోసుకుంటున్న పంటలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



కంచికచర్లలో ఏపుగా పెరుగుతున్న పత్తి పైరు

కంచికచర్ల: ఖరీఫ్‌ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు కళకళ లాడుతున్నాయి. జూన్‌ మాసంలో చెదురుముదురుగా కురిసిన వర్షాలకు రైతులు పలు రకాల పంటలను సాగుచేశారు. జూలై రెండో వారానికి వర్షాలు కురవకపోవటంతో రైతులు సాగుచేసిన మెట్ట పైర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలన్నీ ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఇప్పటికే పెసర పంట మరో 15రోజుల్లో కోతకు వస్తుంది. అదేవిధంగా మొక్కజొన్న, పత్తి చేలు మాత్రం ఏపుగా పెరుగుతున్నాయి.

అన్నదాతలు సాగు చేసిన పంటలు...

నందిగామ నియోజకవర్గంలో ఖరీఫ్‌ సీజన్‌లో రైతులు పలు రకాల పంటలను సాగుచేశారు. నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లో పెసర 2,122 హెక్టార్లు, మొక్కజొన్న 3,146 హెక్టార్లు, పత్తి 9,400 హెక్టార్లు, మినుము 449 హెక్టార్లు, కందిపంట 41, హెక్టార్లలో సాగు చేశారు. ఇంకా వరి, మిర్చి పంటలను సాగుచేయలేదు. సకాలంలో వర్షం కురవటంతో ఈ పంటలన్నీ ఊపిరిపీల్చుకున్నాయి. ఈ ఏడాది సకాలంలో వరుణదేవుడు కరుణించి వర్షాలు కురవటంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. సకాలంలో వర్షాలు కురువటంతో అదునులో పంటలు సాగుచేసామని పంటలన్నీ వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పంట పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని లేకపోతే మొక్కలు జిటకబారి ఎరుపెక్కి కుళ్లిపోయే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.విజయకుమార్‌ తెలిపారు. చేలల్లో ఉన్న వర్షపునీటిని బయటకు వెళ్లేలా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



పేరకలపాడులో కళకళలాడుతున్న పెసర పంట

ఆధార్‌ క్యాంపుల్లో మెరుగైన సేవలను అందించాలి

మున్సిపల్‌ కమిషనర్‌ నాగమల్లేశ్వరరావు



పేటలో ఆధార్‌ క్యాంప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని సచివాలయాల వద్ద జరుగుతున్న ఆధార్‌ క్యాంపులకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని మున్సిపల్‌ కమిషనర్‌ సీహెచ్‌.నాగమల్లేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పలు సచివాలయాల వద్ద జరుగుతున్న ఆధార్‌ క్యాంపులను మున్సిపల్‌ కమిషనర్‌ మంగళవారం పరిశీలించారు. స్థానిక కాకానినగర్‌, రంగస్వామి బజారు వార్డు సచివాలయాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్‌ క్యాంపులను కమిషనర్‌ పర్యవేక్షించారు. సదరు ఆధార్‌ క్యాంపులలో ఆధార్‌ కార్డుల కొత్తగా నమోదు, అడ్రస్‌ మార్పుల కొరకు, తప్పులను సరి చేస్తారని చెప్పారు. సుమారు 50 మంది ఆధార్‌ సరీ్వసును సద్వినియోగపరచుకున్నారు. ఈ ఆధార్‌ క్యాంపులు పట్టణంలో ఈనెల 27 వ తేదీ వరకు జరుగుతాయని కమిషనర్‌ తెలిపారు. ఈనెల 24 వ తేదీన సీతారామపురం(పాత మున్సిపల్‌ కార్యాలయం)లో, పాతపేటగడ్డ రోడ్‌లోని మీ సేవా బిల్డింగ్‌ వార్డు సచివాలయంలో జరుగుతాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్న క్యాంటీన్‌ పనుల పరిశీలన..

స్థానిక సీతారామపురం, విజయవాడ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ ఆధునికీకరణ పనులను మున్సిపల్‌ కమిషనర్‌ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. ప్రభుత్వం వారు సూచించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి వారు నిర్దేశించిన డిజైన్‌ ప్రకారం వచ్చే నెల 10వ తేదీ లోపు పనులను పూర్తి చేయాయాలని మున్సిపల్‌ డీఈఈ, ఏఈ, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

దమ్ము చక్రాలతో రహదారులు ధ్వంసం



పెనుగంచిప్రోలు మండలంలో దూసుకుపోతున్న దమ్ము ట్రాక్టర్‌



అనిగండ్లపాడు వద్ద ఛిద్రమైన రహదారి

పెనుగంచిప్రోలు: ఖరీఫ్‌ సీజన్‌లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట పొలాలను దమ్ము చేసే ట్రాక్టర్లు రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతున్నాయి. దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ట్రాక్టర్లు కనీస ప్రమాణాలు పాటించకుండా రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, గుమ్మడిదూర్రు, శివాపురం, సుబ్బాయిగూడెం, కొల్లికుళ్ల, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం తదితర గ్రామాలతో పాటు వత్సవాయి మండలంలోని రేగులగడ్డ, ఆళ్లూరుపాడు, లింగాల, శింగవరం, తదితర గ్రామాల పక్కగా మునేరు ప్రవహిస్తోంది. మునేరుకు వరద నీరు రావటంతో పాటు బోర్లు కింద నాట్లు పనులు ఊపందుకున్నాయి. దీంతో పొలాలకు దమ్ము చేసేందుకు చక్రాలతో రోడ్ల మీదకు వస్తున్నాయి. వీల్స్‌ ధాటికి ఇటీవల రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు కట్‌ అయిపోతున్నాయి. రైతులు కనీస ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదర్శప్రాయులు తిలక్‌, ఆజాద్‌



లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలవరం: స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌లను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని డాక్టర్‌ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్‌ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో వీరిరువురూ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. చరిత్ర విభాగం అధ్యాపకులు దారావతు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలగంగాధర్‌ తిలక్‌ నిర్వహించిన హోమ్‌ రూల్‌ ఉద్యమం ప్రముఖమైందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ పురంశెట్టి రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌ జయంతి వేడుకలను సీతారాంపురం మండల పరిషత్‌ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గరిక నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్‌, జోసఫ్‌, లక్ష్మి పాల్గొన్నారు.
- లక్ష్మీపురం(తిరువూరురూరల్‌): స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌ జయంతి కార్యక్రమం తిరువూరు మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయోద్యమంలో వీరి పాత్రను ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు సుజాతకుమారి, పద్మలత, లక్ష్మీ శ్యామల పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నియంత్రణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

తిరువూరు: వర్షాకాలంలో సాధారణంగా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ప్రముఖ వైద్య నిపుణులు వివేకానంద అన్నారు. స్థానిక రాజుపేటలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్‌ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈగలు వాలకుండా ఆహార పదార్థాలను జాగ్రత్త చేయడంతో పాటు వేడి ఆహారాన్ని భుజించాలని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం బారిన పడినప్పుడు సొంత వైద్యం, నాటు వైద్యం చేయించుకోకుండా ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌. గంగాధర్‌, స్థానిక ప్రతినిధులు హరికృష్ణ, రాంప్రదీప్‌, సుధాకర్‌, పాపారావు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో నూతన అడ్వాన్స్‌డ్‌ డిగ్రీ కోర్సులు

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాలలో నూతన అడ్వాన్స్‌డ్‌ డిగ్రీ కోర్సులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ బి.సురేష్‌ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్‌ డిగ్రీ కోర్సుల గురించి వివరించారు. అన్ని రంగాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న బీఎస్సీ ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ కోర్సును, కార్పొరేట్‌ రంగాల్లో అత్యధిక ఉద్యోగ అవకాశాలు కలిగిన బీఎస్సీ ఫుడ్‌ టెక్నాలజీ, బీఎస్సీ నర్సింగ్‌, బీఎస్సీ మైక్రో బయాలజీ కోర్సులను ప్రారంభించామన్నారు. మహిళా విద్యార్థులకు ప్రత్యేకంగా విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జగ్గయ్యపేటలోనే ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో 100 శాతం ఉద్యోగ అవకాశాలు గల నూతన డిగ్రీ కోర్సులను అందిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్‌ బి.సరిత తెలిపారు.

- **రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక**

ఇబ్రహీంపట్నం: జాతీయ ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ గురువారం నిర్వహిస్తామని ఏపీఓ ఎం.ప్రమీల మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో గుర్తించిన అంశాలు, అభ్యంతరాలు మండల సామాజిక తనిఖీలో చర్చిస్తారన్నారు.